పేద కుటుంబాలకు అండగా జగనన్న

రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు మల్లాది విష్ణు



గడప గడపకు మన ప్రభుత్వంలో పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): రాష్ట్రంలో పేద కుటుంబాలకు అండగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నిలుస్తున్నారని ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్, సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. 23వ డివిజన్ 98వ వార్డు సచివాలయ పరిధిలో గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. వైఎస్సార్ సీపీ డివిజన్ ఇన్‌చార్జి ఆత్మకూరు సుబ్బారావు, కోఆర్డినేటర్ ఒగ్గు విక్కీతో కలిసి ఎమ్మెల్యే మల్లాది విష్ణు ఇంటింటికీ వెళ్లారు. తొలుత వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. స్థానిక సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వివిధ శాఖల అధికారులతో మాట్లాడి పలు సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించారు. శేషాద్రి శాస్త్రి వీధి, మ్యూజియం రోడ్డు, కాంగ్రెస్ ఆఫీస్ రోడ్డు, దుర్గయ్య వీధుల్లో వీధుల్లో పర్యటించి పారిశుధ్య నిర్వహణ తీరు, డ్రెయిన్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయ పరిధిలో రూ.3 కోట్ల సంక్షేమాన్ని మూడున్నరేళ్లలో అందించినట్లు వివరించారు. నవరత్నాల పథకాలతో నగరంలో వేలాది కుటుంబాలకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లబ్ధి చేకూరుస్తుంటే ఓర్వలేక టీడీపీ సభ్యులు కౌన్సిల్‌లో రాద్ధాంతం చేస్తున్నారని మల్లాది విష్ణు మండిపడ్డారు. ఎన్నికలు వస్తే తప్ప టీడీపీ నేతలకు పింఛన్‌దారులు గుర్తుకురారని ధ్వజమెత్తారు.

హోదాను తాకట్టు పెట్టింది చంద్రబాబు కాదా..?

ప్రత్యేక హోదా, విభజన హామీల సాధనకు వైఎస్సార్ సీపీ ఎంపీలు పోరాడుతున్నారని మల్లాది విష్ణు అన్నారు. స్వార్థపూరిత ఆలోచన విధానాలతో ఆనాడు రాష్ట్ర ప్రయోజనాలను చంద్రబాబు తాకట్టుపెట్టారని విమర్శించారు. కానీ నాటి నుంచి నేటి వరకు ప్రత్యేక హోదాను సజీవంగా ఉంచింది వైఎస్సార్ సీపీ పోరాటమేనని పేర్కొన్నారు. కార్యక్రమంలో డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజరెడ్డి, డీఈలు గురునాథం, రామకృష్ణ, ఏఎంఓహెచ్ రామకోటేశ్వరరావు, సీడీఓ జగదీశ్వరి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కుంగ్‌ఫూ, కరాటే పోటీల్లో 'సెయింట్‌ఆన్స్ స్కూల్' ప్రతిభ



పతకాలు సాధించిన విద్యార్థులతో ప్రిన్సిపాల్ అమలాపుష్పం, కోచ్ రూపాస్‌పాల్

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): హనుమాన్‌జంక్షన్‌లో గత నెల 29న జరిగిన ఏపీ రాష్ట్రస్థాయి ఓపెన్ కుంగ్‌ఫూ, కరాటే చాంపియన్‌షిప్‌లో సింగ్‌నగర్ సెయింట్‌ఆన్స్ స్కూల్ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబర్చారు. 12 గోల్డ్, 8 సిల్వర్, 16 బ్రాంజ్ మెడల్స్‌తో మొత్తం 36 పతకాలు సాధించారు. సత్తా చాటిన విద్యార్థులను పాఠశాల ప్రిన్సిపాల్ సిస్టర్ అమలాపుష్పం గురువారం అభినందించారు. స్కూల్ కరాటే కోచ్ జి.రూపాస్‌పాల్ పాల్గొన్నారు.

అర్హులందరికీ పెన్షన్లు



పెన్షన్లు అందిస్తున్న కార్పొరేటర్ షాహీనా సుల్తానా

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): అర్హులందరికీ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పింఛన్లు అందజేస్తోందని 59వ డివిజన్ కార్పొరేటర్ షాహీనా సుల్తానా అన్నారు. ఆ డివిజన్‌లోని పింఛన్లరకు వైఎస్సార్ పింఛన్ కానుకలను గురువారం ఆమె అందజేశారు. ఆమె మాట్లాడుతూ ఏ రాష్ట్రంలో లేని విధంగా మన ప్రభుత్వం వైఎస్సార్ పెన్షన్ కానుకను ప్రతిష్టాత్మకంగా అమలుచేస్తుంటే ప్రతిపక్షాలు కావాలని అసత్యాలతో ప్రభుత్వంపై బురద చల్లాలని చూడటం దౌర్భాగ్యమన్నారు. రాష్ట్రంలోని అవ్వతాతలు, దివ్యాంగులు, వితంతువులు సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి అండగా నిలుస్తారన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు ఎండీ హఫీజుల్లా, మున్షీ, చిన్నారావు, అమిత్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభ చాటిన 'శిఖర' విద్యార్థులు



విజయవాడ కల్చరల్: అమరావతి బాలోత్సవ్‌లో శిఖర పాఠశాల(రిజోవెన్స్) విద్యార్థులు ప్రతిభ చాటినట్లు ప్రిన్సిపాల్ బండ్లమాధవరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వారిని అభినందించినట్లు పేర్కొన్నారు.

నేటి నుంచి దత్తాత్రేయుడి పునఃప్రతిష్టా మహోత్సవాలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): ముత్యాలంపాడు షిర్డీ సాయిబాబా మందిరంలో శుక్రవారం నుంచి ఆదివారం వరకు మూడు రోజుల పాటు శ్రీదత్తాత్రేయస్వామి పునఃప్రతిష్టా మహోత్సవాలు నిర్వహించడానికి ఏర్పాట్లు పూర్తిచేసినట్లు మందిర కార్యదర్శి కుంచనపల్లి రవిశంకర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మూడో తేదీ శుక్రవారం ఉదయం 8.30 గంటలకు సంకల్పంతో ఉత్సవాలు మొదలవుతాయని పేర్కొన్నారు.

కార్డుదారులకు ఉచితంగా బియ్యం

పాయకాపురం(విజయవాడరూరల్): స్థానిక 61వ డివిజన్లో మూడు రేషన్ షాపుల పరిధిలోని కార్డుదారులకు గురువారం ఉచితంగా బియ్యం పంపిణీ చేశారు. ఎండీయూ ఆపరేటర్ నాలంబాబు భాస్కరరావు కొట్టు సెంటర్లో బియ్యం అందజేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉచితంగా బియ్యం పంపిణీ చేస్తున్నట్టు సివిల్ సప్లయీస్ ఆర్ఐ శరత్ తెలిపారు.

సిల్టు తొలగింపు

మధురానగర్(విజయవాడసెంట్రల్): అయోధ్యనగర్‌లోని మురుగు కాల్వల్లో పేరుకుపోయిన సిల్టును గురువారం వీఎంసీ పారిశుధ్య సిబ్బంది తొలగించారు. ఈ సందర్భంగా పరిసరాల పరిశుభ్రతను పాటించాల్సిన ఆవశ్యకతను వివరించారు.

'గడప గడపకు మన ప్రభుత్వం' సమస్యల పరిష్కారం

మధురానగర్(విజయవాడసెంట్రల్): అయోధ్యనగర్‌లో చెట్టు ప్రమాదకరంగా మారిందని ఇటీవల డివిజన్‌లో జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో స్థానికులు ఫిర్యాదు చేశారు. దీంతో మల్లాది విష్ణు ప్రమాదకరంగా మారిన చెట్టును తొలగించాలని అధికారులను ఆదేశించారు. ఈ మేరకు అధికారులు గురువారం జేసీబీ సాయంతో చెట్టు తొలగించారు. దీనిపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

శ్రీదత్తసాయి మందిరంలో అన్నప్రసాద వితరణ

మధురానగర్(విజయవాడసెంట్రల్): స్థానిక పసుపుతోట శ్రీదత్తసాయి మందిరంలో గురువారం బాబాకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ జరిగింది. మందిర వ్యవస్థాపకుడు తంగెళ్ల మూడి వీర మోహనరావు బాబాకు ప్రత్యేక పూజలు చేశారు. శ్రీసాయినక్షత్రమాలిక మండలి ఆధ్వర్యాన పారాయణం జరిగింది.

ప్రగతి పథంలో సెంట్రల్



పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విష్ణు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో సెంట్రల్ నియోజకవర్గం ప్రగతిపథంలో పయనిస్తోందని ప్లానింగ్ బోర్డు వైస్‌చైర్మన్, ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. 57వ డివిజన్ న్యూరాజరాజేశ్వరీపేటలోని సింగ్‌నగర్ పోలీస్‌స్టేషన్ రోడ్డులో రూ.20 లక్షల వ్యయ అంచనాతో చేపట్టిన రోడ్డునిర్మాణ పనులు, 58వ డివిజన్ తోటవారి వీధిని ఇన్నర్ రింగ్ రోడ్డుతో అనుసంధానం చేస్తూ రూ.15.35 లక్షల వ్యయ అంచనాతో చేపట్టిన రోడ్డు, యూజీడీ, తాగునీటి పైపులైన్ల నిర్మాణ పనులను డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ, 57వ డివిజన్ కార్పొరేటర్ ఇసరపు దేవితో కలిసి గురువారం ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హయంలో కేవలం శిలాఫలకాలకు మాత్రమే పరిమితమైన అభివృద్ధిని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేతల్లో చూపిస్తోందన్నారు. వీఎంసీ అధికారులు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

మార్చి నెలాఖరుకు రోడ్ల పనులు పూర్తి



61వ డివిజన్లో రోడ్ల నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు

పాయకాపురం(విజయవాడరూరల్): సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సూచనల మేరకు మార్చినెలాఖరుకు సెంట్రల్ నియోజకవర్గంలో జరుగుతున్న రోడ్ల నిర్మాణ పనులు పూర్తి చేయనున్నట్టు ప్లానింగ్ బోర్డు వైస్‌చైర్మన్, ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. గురువారం 61వ డివిజన్ భాస్కరరావు కొట్టు సెంటర్లో రూ. 84.35 లక్షల వ్యయ అంచనాతో నిర్మించే బీటీ రోడ్డు నిర్మాణ పనులను డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజారెడ్డి, కార్పొరేటర్ ఉమ్మడి రమాదేవితో కలిసి ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నగరంలో రోడ్ల అభివృద్ధికి అధిక ప్రాధాన్యమిస్తున్నారన్నారు. డివిజన్లో ప్రధాన రోడ్లు, అంతర్గత రోడ్డు, ప్రజలకు అవసరమైన అభివృద్ధి పనులు చేశామని తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ఉమ్మడి రమాదేవి, డీఈ గురునాథం, వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఉమ్మడి వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

తోకచుక్కను చూడటానికి చిన్నారుల ఆసక్తి



మైక్రోస్కోప్ ద్వారా తోకచుక్కను చూపేందుకు ప్రయత్నిస్తున్న శాస్త్రవేత్త రాధాకృష్ణ

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): ఆకుపచ్చ రంగును అద్దుకున్న సీ/2022 ఈ3(జెడ్ టీఎఫ్) తోక చుక్కను చూసేందుకు సింగ్‌నగర్ పరిసర ప్రాంతాలలోని చిన్నారులు, యువత, తల్లిదండ్రులు అధిక ఆసక్తిని కనబర్చారు. జీవితంలో ఒకేఒక సారి చూడగలిగే ఈ తోక చుక్కను మళ్లీ తిరిగి చూడాలంటే సుమారు 50 వేల సంవత్సరాల తర్వాతే సాధ్యపడుతుందని శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. ఖగోళ పరిశోధకుడు, శాస్త్రవేత్త రాధాకృష్ణ, జిల్లా సైన్స్ అధికారి మైనం హుస్సేన్‌లు వాంబేకాలనీలోని డిస్నీల్యాండ్ వద్ద మైక్రోస్కోప్ ద్వారా వారికి తోకచుక్కను చూపేందుకు ప్రయత్నించారు. సోలార్ సిస్టంకు బయట ఉండే ఈ తోకచుక్క భూమికి సమీపంలో వెళ్తుండడంతో దీన్ని చూసే అవకాశం లభిస్తుందని, చంద్రుడి కంటే సుమారు 100 రెట్లు అధిక దూరంలో ఉంటుందని వారు ప్రజలకు వివరించారు. తమ జీవితంలో ఈ తోక చుక్కను చూసే భాగ్యం లభించడం అదృష్టంగా భావించి చిన్నారులు, యువత, తల్లిదండ్రులు తోకచుక్కను చూసేందుకు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఆకాశంలో వెలుతురు, భూమిపై కాలుష్యం కారణంగా తోకచుక్క సరిగా కనబడడం లేదని శాస్త్రవేత్త రాధాకృష్ణ బృందం తెలిపారు. సైన్స్ ఉపాధ్యాయులు లింగారెడ్డి, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

తొలగనున్న ముంపు, మురుగు సమస్యలు

- మురుగునీటి శుద్ధి, వాన నీటి పారుదలపై వీఎంసీ ప్రత్యేక దృష్టి
- బుడమేరుకు వాన నీరు మళ్లింపు
- అసంపూర్తిగా ఉన్న స్ట్రాంవాటర్ డ్రైన్ల నిర్మాణానికి రూ 9.5 కోట్లతో ప్రణాళిక
- రూ.30 కోట్లతో ఎస్టీపీల ఆధునీకరణ
- తాగునీటి సరఫరాకూ రూ. 21 కోట్లు



బుడమేరుకు వాన నీటిని మళ్లించడానికి ప్రణాళికలు

పటమట(విజయవాడతూర్పు): నగరంలో తాగు నీరు, వర్షం నీరు మళ్లింపు, మురుగునీటి పారుదలకు వీఎంసీ ప్రత్యేక ప్రణాళికలు రూపొందించింది. రూ. 60.5 కోట్ల వ్యయ అంచనాతో ఆయా ప్రాంతాల్లో దీర్ఘకాలంగా పేరుకుపోయిన సమస్యలను పరిష్కరించడానికి వీఎంసీ అధికారులు కసరత్తు చేస్తున్నారు. సర్కిల్-2 పరిధిలో బుడమేరుకు డైవర్షన్ చేయాల్సిన స్ట్రాం వాటర్ డ్రైన్ నిర్మాణానికి, ముంపు సమస్యల తొలగించడానికి, తాగునీటి సరఫరా మెరుగు పరచడానికి ప్రణాళికలు రూపొందించారు

బుడమేరుకు వర్షం నీరు

సెంట్రల్‌లోని 1వ డివిజన్ కార్మెల్‌నగర్, షిర్డీసాయి నగర్, 63వ డివిజన్‌లోని రాజీవ్‌నగర్, రాధా నగర్, పాయకాపురం, 64వ డివిజన్‌లోని కండ్రిక ప్రాంతాల్లో ఎల్‌అండ్‌టీ చేపట్టిన స్ట్రాం వాటర్ డ్రైన్ పనులు అసంపూర్తిగా మిగిలాయి. స్థానికంగా ఉన్న ముంపు సమస్యను ఈ ప్రాంతవాసులు ఎమ్మెల్యే విష్ణు దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే.. వర్షపునీటి మళ్లింపుకు డ్రైన్లు నిర్మించాలని వీఎంసీకి ప్రతిపాదన చేశారు. రూ.9.5 కోట్లతో అసంపూర్తిగా మిగిలిన స్ట్రాం వాటర్ డ్రైన్ పనులు చేయనున్నారు.

ఇవి చేయనున్నారు

- ఒకటో డివిజన్ గుణదల రైల్వేగేటు వద్ద బాక్స్ కల్వర్టు నిర్మాణానికి రూ. 81.45 లక్షలు, కార్మెల్ నగర్ షిర్డీసాయినగర్ వద్ద కల్వర్టులు, ఆర్‌సీసీ డ్రైయిన్ నిర్మాణానికి 2.44 కోట్లు కేటాయించారు.
- 61వ డివిజన్‌ఓ పాయకాపురం చెరువు నుంచి డిస్నీల్యాండ్ వరకు అవుట్‌ఫాల్ డ్రైయిన్ నిర్మాణానికి రూ. 55.86 నిధులు ఖర్చు చేయనున్నారు.
- 63వ డివిజన్‌లోని రాజీవ్‌నగర్ కట్ట వద్ద స్ట్రామ్ వాటర్ డ్రైన్ నిర్మాణానికి రూ. 3.17 కోట్లు
- 63, 64 డివిజన్‌లో రాధానగర్, కండ్రిక వద్ద కల్వర్టులు, ఆర్‌సీసీ డ్రైయిన్ నిర్మాణానికి రూ. 2.55 కోట్లు ఖర్చు చేయనున్నారు.

మురుగునీటి పారుదలకు

కేంద్ర ప్రభుత్వం అమృత్ 2.0లో 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.63 కోట్ల నిధులు కేటాయించింది. ఇందులో రూ.51 కోట్లు తాగునీటిసరఫరా, మురుగునీటి పారుదలకు అధికారులు వెచ్చించనున్నారు.

తాగునీటి సరఫరాకు

తాగునీటి ఎద్దడి నివారించడానికి ఎలివేటెడ్ సర్వీస్ రిజర్వాయర్(ఈఎల్‌ఎస్‌ఆర్), గౌండ్ లెవల్ సర్వీస్ రిజర్వాయర్(జీఎస్ఎల్ఆర్) నిర్మాణాలకు, ఇన్‌టెక్ వెల్ నిర్మాణానికి రూ. నూతన పైపులైన్ల ఏర్పాటుకు, పంపుసెట్ల బిగింపుకు రూ.21 కోట్లు ఖర్చు చేయనున్నారు.

> **ముంపు సమస్య పరిష్కారానికి చర్యలు**
>
> శివారు ప్రాంతాలను వరదనీటి సమస్య తీవ్రంగా వేధిస్తోందని పలు ఫిర్యాదుల మేరకు స్థానికంగా స్ట్రాంవాటర్ డ్రైన్ నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నాం. ఇది పూర్తయితే దేవీనగర్ కట్టరోడ్డు, వడ్డెరకాలనీ, ఎన్ఎస్‌సీ బోస్‌నగర్, కండ్రిక నుంచి బుడమేరులో కలుస్తాయి.
>
> – ప్రభాకర్, సీఈ, వీఎంసీ

మత సామరస్యానికి ప్రతీక గుణదల పుణ్యక్షేత్రం

గుణదల (విజయవాడ తూర్పు): మత సామరస్యానికి ప్రతీకగా గుణదల మేరీమాత పుణ్యక్షేత్రం నిలుస్తోందని రెవ.ఫాదర్ బూరగ వినోద్ తెలిపారు. గుణదల మహోత్సవాల నవదిన ప్రార్థనల్లో భాగంగా గురువారం సాయంత్రం జరిగిన ప్రార్థనల్లో ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఫాదర్ వినోద్ మాట్లాడుతూ గుణదల క్షేత్రం కులమతాలకు అతీతంగా ఆధ్యాత్మికతను సంతరించుకుందన్నారు. అనంతరం సమష్టి దివ్యబలి పూజ సమర్పించి భక్తులకు సత్ప్రసాదాన్ని అందచేశారు. అంతకు ముందు పుణ్యక్షేత్ర గురువులు, మతకన్యలు జపమాలలు చేతబూని కొండ పై ఉన్న మరియమాత స్వరూపం వద్దకు చేరుకున్నారు. కార్యక్రమంలో మోన్సిగ్నోర్ ఫాదర్ మువ్వల ప్రసాద్, పుణ్యక్షేత్ర రెక్టర్ ఫాదర్ యేలేటి విలియం జయరాజ్, ఫాదర్ గాబ్రియేలు, ఫాదర్ మరియన్న, ఫాదర్ సునీల్ రాజు తదితరులు పాల్గొన్నారు.

సినీ నటి జమున నటజీవితం ఆదర్శం



జమున చిత్రాల్లోని పాటలు ఆలపిస్తున్న గాయనీ గాయకులు

విజయవాడ కల్చరల్: సినీ నటి జమున నటజీవితం భావి నటీమణులు ఆదర్శంగా తీసుకోవాలని విశ్రాంత పోలీస్ అధికారి డేవిడ్ రాజు అన్నారు. తెలుగు కళావాహిని, జీఆర్‌కే పోలవరపు కోటేశ్వరరావు సాహితీ పీఠం, శ్రీ కళాభారతి ఆధ్వర్యంలో గురువారం సినీ నటి జమున సంస్మరణ సభ, స్వరాంజలి కార్యక్రమాన్ని గాంధీనగర్ కౌతా పూర్ణానందం కళావేదికపై నిర్వహించారు. డేవిడ్ రాజు మాట్లాడుతూ జమున సినీనటిగా, ప్రజాప్రతినిధిగా ప్రతిభ చాటుకున్నారన్నారు. తెలుగు కళావాహిని అధ్యక్షుడు చింతకాయల చిట్టిబాబు మాట్లాడుతూ ఆమె అగ్రనటులతో పోటాపోటీగా నటించారన్నారు. ఆమె రంగస్థల నటిగా నగరంలోని హనుమంతరాయ గ్రంథాలయంలో అనేక ప్రదర్శనలు ఇచ్చారని గుర్తు చేశారు. అతిథులు జమున చిత్ర పటానికి శ్రద్ధాంజలి ఘటించారు. హైదరాబాద్ నుంచి వచ్చిన గాయనీమణులు దమయంతి, కస్తూరి అలివేణి, టి.శారద, కందర్ప రాధ, కొండలరావు, మోహన్‌రాజ్, శ్యామ్ ప్రసాద్ జమున నటించిన చిత్రాలలోని పాటలను ఆలపించారు.

ప్రభుత్వ ప్రోత్సాహకాలను వినియోగించుకోవాలి

జిల్లా పరిశ్రమల కేంద్రం డెప్యూటీ డైరెక్టర్ నరేంద్రబాబు



మాట్లాడుతున్న నరేంద్రబాబు

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): ప్రభుత్వ ప్రోత్సాహకాలను యువత వినియోగించుకోవాలని జిల్లా పరిశ్రమ కేంద్రం డెప్యూటీ డైరెక్టర్ కె.నరేంద్రబాబు చెప్పారు. స్థానిక రావిచెట్టు సెంటర్‌లోని జనశిక్షణ సంస్థాన్‌లో గురువారం పరిశ్రమల స్థాపనపై యువతకు అవగాహన సదస్సు జరిగింది. నరేంద్రబాబు మాట్లాడుతూ వృత్తివిద్యా కోర్సులు నేర్చుకున్న వారు గ్రామీణ ప్రాంతాల్లో ఉత్పత్తి యూనిట్లు స్థాపించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాయితీలను అందిస్తున్నాయన్నారు. జిల్లా పరిశ్రమల కేంద్రం ప్రమోషన్ ఆఫీసర్ వేణు మాట్లాడుతూ పరిశ్రమల స్థాపనకు బ్యాంకుల నుంచి రుణాలు పొందడం, వివిధ ప్రభుత్వ శాఖల నుంచి అవసరమైన అనుమతులపై వివరించారు. జనశిక్షణ సంస్థాన్ చైర్‌పర్సన్ విద్యాకన్న మాట్లాడుతూ వృత్తి విద్యా కోర్సుల్లో శిక్షణ పూర్తి చేసిన యువతకు చిన్న తరహా పరిశ్రమల స్థాపనపై అవగాహన లేకపోవడంతో ఇంటికే పరిమితం అవుతున్నారని, వారి కోసం సదస్సు ఏర్పాటు చేశామన్నారు. జనశిక్షణ సంస్థాన్ డైరెక్టర్ ఎ.పూర్ణిమ, సంస్థ సిబ్బంది, శిక్షణార్థులు పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్‌లో బీసీలకు అన్యాయం

బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కన్వీనర్ బోను దుర్గానరేష్

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): కేంద్ర బడ్జెట్‌లో బీసీలకు తీవ్ర అన్యాయం జరిగిందని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కన్వీనర్ బోను దుర్గ నరేష్ అన్నారు. కేంద్ర బడ్జెట్ లో బీసీలకు రూ. 2 లక్షల కోట్లు కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు. గురువారం ప్రెస్ క్లబ్ లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బడ్జెట్‌లో కేవలం రూ. 2 వేల కోట్లు కేటాయించటం దుర్మార్గమన్నారు. బీసీల సమస్యలపై ఈ నెల 8, 9 తేదీల్లో డిల్లీలో నిరసన కార్యక్రమం చేపట్టనున్నట్లు తెలిపారు. ఎంపీ, బీసీ సంక్షేమ సంఘం జాతీయ వ్యవస్థాపకుడు కృష్ణయ్య నేతృత్వంలో జరిగే నిరసనను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ముద్దాడ గణేష్ భవాని, ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు పోతిన వర ప్రసాద్, యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షులు పిళ్ల శ్రీనివాసరావు, యువజన విభాగం నగర అధ్యక్షులు పి.కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా హనుమత్ వాహనోత్సవం



హనుమత్ వాహనంపై స్వామివారు



ఎదుర్కోలు ఉత్సవంలో ఉభయదేవేరులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): బ్రాహ్మణ వీధిలోని శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో శ్రీవారి హనుమత్ వాహనోత్సవం గురువారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలయంలో జరుగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూడో రోజు పలు విశేష వైదిక కార్యక్రమాలను నిర్వహించారు. ఉదయం కృష్ణానది నుంచి మంగళవాయిద్యాలతో పవిత్ర జలాన్ని తీసుకొచ్చి నిత్యార్చన తదితర కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం దశావతార మంత్ర పారమాత్మిక హోమం చేశారు.

సందడిగా ఎదుర్కోలు ఉత్సవం

శ్రీవారి కంటే అమ్మవారే ఎక్కువ..... కాదు.... అమ్మవారి కంటే అయ్యవారే ఎక్కువ...... అంటూ పండితులు వాదించుకుంటూ ఎదుర్కోలు ఉత్సవాన్ని రక్తి కట్టించారు. శుక్రవారం సాయంత్రం వేంకటేశ్వరస్వామి వారి కల్యాణ మహోత్సవం జరగనున్న క్రమంలో గురువారం రాత్రి ఆలయ ప్రాంగణంలో ఎదుర్కోలు ఉత్సవాన్ని నిర్వహించారు. ఆగమ పండితులు పొన్నంగిపల్లి శ్రీరామచంద్రమూర్తి తదితరులు కార్యక్రమాన్ని నిర్వహించారు.

శ్రీవారి ఊరేగింపు

బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామి వారు సాయంత్రం హనుమత్ వాహనంపై ఊరేగారు. మంగళవాయిద్యాలు, భజన బృందాలు, అర్చకులు వెంటరాగా స్వామి వారి వాహనోత్సవం ముందుకు సాగింది.

కబడ్డీ సంఘ వివాదం సమసిపోలేదు

సంఘ కార్యదర్శి వీర్లంకయ్య

విజయవాడ స్పోర్ట్స్: ఆంధ్రా కబడ్డీ అసోసియేషన్ రిజిస్ట్రేషన్‌పై కోర్టులో వాదనలు జరుగుతున్నాయని, సంఘ వివాదం సమసిపోలేదని ఆంధ్రా కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి వీర్లంకయ్య గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సంఘ రిజిస్టర్ నెంబర్ 115/2010పై హై కోర్టులో రెండు పిటిషన్లు తాము దాఖలు చేశామని తెలిపారు. వీటిలో రిట్ పిటిషన్ 16899/2019 కేసును తామే విత్‌డ్రా చేసుకున్నామని, 924/2021పై వాదనలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. అమెచ్యూర్ కబడ్డీ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా గుర్తింపు తమ సంఘానికే ఉందని తెలిపారు. కబడ్డీ సంఘం తమదేనని కొందరు వ్యక్తులు చేస్తున్న అసత్య ప్రచారాలు నమొద్దని పేర్కొన్నారు.

మూడు కేజీల గంజాయి స్వాధీనం

పాయకాపురం(విజయవాడరూరల్): గంజాయి కలిగి ఉన్న ముగ్గురు వ్యక్తులను నున్న రూరల్ పోలీసులు గురువారం అరెస్ట్ చేసి వారిపై కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పాయకాపురం లక్ష్మీనగర్‌లో మూడు కేజీల గంజాయి కలిగి ఉన్న కెసర దేవేంద్రరెడ్డి, చక్రాల పవన్‌కుమార్, వంగివరపు దీపక్‌లను అరెస్ట్ చేశారు. మూడు కేజీల గంజాయిని స్వాధీనం చేస్తున్నారు.

ప్రకటన

[illegible]

పి. రామమోహనరావు, దాము లక్ష్మణకుమార్, ఎ. రాజరాజేశ్వరి, అర్జీదార్లు
డోరు నెం. 23-2-1, సత్యనారాయణపురం, విజయవాడ-11. సెల్: 9392114922

● ఉత్సాహంగా క్యాంప్‌ఫైర్

పాలిటెక్నిక్ గేమ్స్, స్పోర్ట్స్ విజయవాడ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఉత్సాహంగా సాగుతున్నాయి. క్రీడా ప్రాంగణంలో గురువారం రాత్రి నిర్వహించిన క్యాంప్‌ఫైర్‌లో క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు.
– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ







సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు | వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు | శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

విజయవాడ సెంట్రల్ : 90102 01611

Office mail : sakshiads@gmail.com